సూర్య
www.suryaa.com
17 వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
www.suryaa.com
4 PM
www.suryaa.com
గురువారం
11 ఏప్రిల్ 2024
పేజీలు: 02




## తిరుమలలో పట్టుబడ్డ నకిలీ ఐఏఎస్ అధికారి

ఐఏఎస్ అధికారిగా చెలామణి అవుతున్న నకిలీని తిరుమలలో టీటీడీ విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నరసింహారావు అనే వ్యక్తి జాయింట్ సెక్రటరీ హోదాలో శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం కోసం సిఫార్సు లేఖని సమర్పించాడు. ఈవో కార్యాలయ సిబ్బంది అతడి ప్రవర్తనపై అనుమానంతో విజిలెన్స్ అధికారులకి సమాచారం అందించడం జరిగింది. వారు అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా అతడు గుంటూరు మరియు విజయవాడలో ఇదే తరహా మోసాలకు పాల్పడినట్టు తెలిపారు.



# ఘనంగా రంజాన్ వేడుకలు..
# భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు

తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లింలు మసీదులకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. చిన్నాపెద్దలు పరస్పరం ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. హైదరాబాద్‌లోని మీర్ ఆలం ఈద్గా, చార్మినార్, మక్కా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఇంటికి వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సనత్‌నగర్‌లో వేడుకలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఆదిలాబాద్‌లో సామాన్యులతో కలిసి జిల్లా ఎస్పీ ఆలం ప్రార్థనలు చేశారు. ఢిల్లీలోని జామా మసీదు భక్తులతో కిటకిటలాడింది.









## హెపటైటిస్ కేసుల్లో భారత్‌కు రెండో స్థానం

హెపటైటిస్-బి, సి కేసుల విషయంలో భారత్.. చైనా తర్వాత రెండో స్థానంలో ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) తాజా నివేదిక పేర్కొంది. 2022లో భారత్‌లో ఈ రుగ్మత బాధితులు 3.5 కోట్ల మంది ఉన్నారని తెలిపింది. కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్ తలెత్తడం వల్ల హైపటైటిస్ వస్తుంది. దీనివల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. అవి మరణానికి దారితీయవచ్చు.

## భారతదేశంలోని ప్రముఖ మసీదులివే..

దేశవ్యాప్తంగా ముస్లింలు ఈద్ వేడుకలను ఘనంగా చేసుకుంటున్నారు. మనదేశంలో ముస్లింల పవిత్ర ప్రార్థనా స్థలాలైన మసీదులు చాలానే ఉన్నాయి. వీటిలో కొన్ని మసీదులు వాస్తుశిల్పానికి ప్రసిద్ధి చెందాయి. భారతదేశంలోని కొన్ని ప్రముఖ మసీదుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



**జామా మసీదు, ఢిల్లీ**

జామా మసీదు భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని ప్రసిద్ధ మసీదులలో ఒకటి. 1956లో షాజహాన్ నిర్మించిన ఈ మసీదులో సుమారు 25 వేల మంది ఒకేసారి ప్రార్థనలు చేయవచ్చు. ఎర్ర ఇసుకరాయి, పాలరాయితో నిర్మితమైన ఈ మసీదు మీనార్ 135 అడుగుల ఎత్తు కలిగివుంది.

**మక్కా మసీదు, హైదరాబాద్**

దేశంలోని పురాతన, అతిపెద్ద మసీదులలో ఇది ఒకటి. మక్కా మసీదు 1694లో మక్కా నుండి తెచ్చిన మట్టి, ఇటుకలతో నిర్మితమయ్యింది. 75 అడుగుల ఎత్తైన ఈ మసీదులో ఒకేసారి 10 వేల మంది కూర్చునే అవకాశం ఉంది. ఈ మసీదు చౌమహల్లా ప్యాలెస్, లాడ్ బజార్, చార్మినార్ తదితర చారిత్రక ప్రదేశాలకు సమీపంలో ఉంది.






**తాజ్-ఉల్-మసీదు, భోపాల్**

తాజ్-ఉల్-మసీదు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉంది. ఇది ఆసియాలోనే అతిపెద్ద, అందమైన మసీదుగా పేరుగాంచింది. ఈ మసీదును 'మసీదుల కిరీటం' అని కూడా పిలుస్తారు. లక్ష మందికి పైగా జనం ఈ మసీదులో కూర్చుని ప్రార్థనలు చేయవచ్చు.

**జామియా మసీదు, శ్రీనగర్**

శ్రీనగర్‌లో ఉన్న జామియా మసీదు భారతదేశంలోని అత్యంత పవిత్రమైన మసీదులలో ఒకటి. దీనిలో ఒకేసారి 33 వేల మంది ప్రార్థనలు సాగించవచ్చు. జమ్మూ కాశ్మీర్‌లోని పాత శ్రీనగర్‌లో ఈ మసీదు ఉంది.





**బడా ఇమాంబర, లక్నో**

1784లో అవధ్ నవాబ్ నిర్మించిన ఈ మసీదులో ఒకేసారి మూడు లక్షల మందికి పైగా జనం ప్రార్థనలు చేసుకునే అవకాశం ఉంది. ఇది భారతదేశంలోనే అతిపెద్ద మసీదుగా గుర్తింపు పొందింది. ఇది ఉత్తరప్రదేశ్‌లో ఉంది.




**జామా మసీదు, ఆగ్రా**

యూపీలోని ఆగ్రా కోటకు ఎదురుగా ఉన్న ఈ జామా మసీదు దేశంలోని అతిపెద్ద మసీదులలో ఒకటిగా పేరొందింది. దీనిని ఫ్రైడే మసీదు అని కూడా పిలుస్తారు. ఈ మసీదు ఎర్ర ఇసుకరాయి, తెల్లని పాలరాయితో నిర్మించారు.



## ఎన్నికల బరిలో నటీనటులు

లోక్ సభ ఎన్నికల్లో ఈసారి సినీగ్లామర్ బాగా పెరిగింది. బాలీవుడ్ నుంచి కోలీవుడ్ వరకూ డజనుకుపైగా సినీ తారలు ఎన్నికల బరిలో నిలిచారు. ఇప్పటికే పలువురు సీనియర్ నటులు ఎంపీలుగా ఎన్నికై మరోసారి రంగంలోకి దిగుతుండగా.. తాజాగా మరికొందరు రాజకీయాల్లో తమ అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ ఎన్నికల్లో నటీనటులు బీజేపీ పార్టీ నుంచి ఎక్కువ మంది పోటీలో ఉన్నారు.




## మురుగదాస్, సల్మాన్ చిత్రానికి పవర్ఫుల్ టైటిల్ రివీల్ చేసిన మేకర్స్

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ హీరోగా ఇప్పుడు పలు సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రాల్లో రీసెంట్ గా తమిళ దర్శకుడు ఏ ఆర్ మురుగదాస్ తో అనౌన్స్ చేసిన సినిమా కూడా ఒకటి. మరి సల్మాన్ మురుగదాస్ కాంబినేషన్ అంటే బాలీవుడ్ మార్కెట్ లో మంచి క్రేజ్ ఉంది. దీనితో మళ్ళీ ఎన్నో ఏళ్ళ తర్వాత ఓ సినిమా అనౌన్స్ చేయడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ చిత్రంపై లేటెస్ట్ గా మేకర్స్ సాలిడ్ అప్డేట్ ని మేకర్స్ అందించారు. సల్మాన్ చేతనే సినిమా టైటిల్ రివీల్ చేస్తూ ఈ సినిమాకి పవర్ ఫుల్ టైటిల్ "సికందర్" అంటూ రివీల్ చేశారు. ఇక ఈ ఈద్ కి "మైదాన్", "బడేమియా చోటేమియా"లు వస్తే వచ్చే ఈద్ కి "సికందర్" కలుస్తాడు మిమ్మల్ని అంటూ సల్మాన్ తన మార్క్ పోస్ట్ తో ఫ్యాన్స్ కి ఈ ఈద్ కానుకగా సాలిడ్ అప్డేట్ అందించాడు. ఇక ఈ చిత్రానికి సల్మాన్ సన్నిహితుడు సాజిద్ నదియాద్ వాలా నిర్మాణం వహిస్తున్నాడు.

## స్మృతి ఇరానీ Vs ప్రియాంక
### యూపీలో ఆసక్తికర సమరం!

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కేటాయింపు అంశంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాల నుంచి ఎవరు పోటీ చేస్తారనేది తేలియాల్సి ఉంది. కాగా, ముందు నుంచి ఈ స్థానంలో రాబర్ట్ వాద్రా పోటీ ఉంటారనే వార్తలు వినిపించినప్పటికీ అది జరగపోవచ్చు అని సమాచారం. కాగా, గాంధీ కుటుంబంతో విడదీయరాని బంధం ఉన్న అమేథీ, రాయబరేలీ స్థానాల్లో ఎవరు పోటీ చేస్తారనే అంశం కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోని ఈ విషయంలో ఒక హింట్ ఇచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి గాంధీ కుటుంబ సభ్యులు బరిలో ఉంటారని వెల్లడించారు. కాగా, ఆంటోని బుధవారం ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అమేథీ, రాయబరేలీ సీట్లపై ఎలాంటి ఊహాగానాలు వద్దు. యూపీ నుంచి గాంధీ కుటుంబమే పోటీ చేస్తారు. రాబర్ట్ వాద్రా అక్కడ పోటీ చేసే అవకాశం ఉండకపోవచ్చు అని కామెంట్స్ చేశారు. దీంతో, ప్రియాంక లేదా రాహుల్ గాంధీ యూపీ నుంచి పోటీ చేస్తారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. రాహుల్ ఇప్పటికే కేరళలోని వయనాడ్ నుంచి బరిలోకి దిగిన విషయం తెలిసిందే. ఇక, అమేథీలో బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీని ఢీకొట్టేందుకు ప్రియాంకను బరిలోకి దింపుతారా? అనేది తెలియాల్సి ఉంది. ఒకవేళ ప్రియాంక కనుక అమేథీ నుంచి పోటీలో నిలిస్తే రాజకీయం ఆసక్తికరంగా మారే అవకాశం ఉంటుంది. మరోవైపు.. ఇండియా కూటమి సీట్ల పంపకాల్లో భాగంగా అమేథీ స్థానం కాంగ్రెస్‌కు దక్కిన విషయం తెలిసిందే.





## సంజూ శాంసన్‌కు భారీ జరిమానా

ఓటమి బాధలో ఉన్న రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్‌కు మరో భారీ షాక్ తగిలింది. ఐపీఎల్ నిర్వాహకులు అతడికి రూ. 12 లక్షల మేర జరిమానా విధించారు. కాగా సొంత మైదానం జైపూర్‌లో రాజస్తాన్ బుధవారం గుజరాత్ టైటాన్స్‌తో తలపడిన విషయం తెలిసిందే. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి 196 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఆఖరి బంతికి గుజరాత్ టైటాన్స్ స్టార్ రషీద్ ఖాన్ ఫోర్ బాది తమ జట్టును గెలిపించాడు. ఫలితంగా ఐపీఎల్-2024 ఆరంభం నుంచి వరుసగా నాలుగు విజయాలు నమోదు చేసిన పడింది. అయితే, ఆఖరి వరకు ఉత్కంఠ రేపిన ఈ మ్యాచ్‌లో రాజస్తాన్ చేజేతులా మ్యాచ్‌ను చేజార్చుకుంది.ఓవర్ రేటు విషయంలో నిర్దిష్ట సమయానికి ఐదు నిమిషాలు వెనుకబడి ఉండటంతో చివరి ఓవర్‌లో సర్కిల్ బయట ఓ ఫీల్డర్‌ను తక్కువగా ఉంచాల్సి వచ్చింది. ఫలితంగా స్వేచ్ఛగా బ్యాట్ ఝులిపించగలిగిన గుజరాత్ బ్యాటర్లు విజయానికి బాటలు వేసి.. పని పూర్తి చేశారు.




### లక్షద్వీప్‌లో తొలి ప్రైవేటు బ్యాంక్
## హెచ్‌డీఎఫ్‌సీ

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లక్షద్వీప్‌లోని కవరత్తీ ద్వీపంలో తొలి శాఖను ప్రారంభించింది. ఈ కేంద్రపాలిత ప్రాంతంలో బ్రాంచిని ఏర్పాటు చేసిన తొలి ప్రైవేటు బ్యాంకుగా నిలిచింది. మాల్దీవులతో వివాదం నేపథ్యంలో లక్షద్వీప్ పర్యటక స్థలంగా ప్రాముఖ్యతను సంతరించుకుంటున్న విషయం తెలిసిందే. ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు అక్కడ పర్యటకాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల టూరిస్టుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ తరుణంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తమ శాఖను ప్రారంభించడం గమనార్హం. పర్సనల్, డిజిటల్ బ్యాంకింగ్ సహా కస్టమర్లకు వివిధ రకాల సేవలను అందిస్తూ ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో సేవలను మెరుగుపరుస్తామని హెచ్‌డీఎఫ్‌సీ తెలిపింది. రిటైలర్లకు క్యూఆర్ కోడ్ ఆధారిత లావాదేవీలను సైతం అందిస్తామని వెల్లడించింది.

# లవ్ గురు రివ్యూ

విజయ్ ఆంటోనీ కథానాయకుడిగా నటిస్తూ, స్వయంగా నిర్మించిన చిత్రమే 'లవ్ గురు'. కాగా ఈ సినిమా ఈ రోజు విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఈ చిత్రం ఏ మేరకు మెప్పించిందో రివ్యూలోకి వెళ్లి తెలుసుకుందాం!




కథ: అరవింద్ (విజయ్ ఆంటోని) ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి మలేషియా నుంచి ఇండియా వస్తాడు. తన జీవితంలో కొన్ని సమస్యలు కారణంగా 35 ఏళ్లు వచ్చినా అరవింద్ పెళ్లికి మాత్రం దూరంగా ఉండి పోయాడు. ఐతే, ఈ 35 ఏళ్ల అరవింద్ తన బంధువుల అమ్మాయి లీల (మృణాళిని రవి) ని చూసి ప్రేమలో పడతాడు. మరోపక్క లీలా మాత్రం తాను పెద్ద హీరోయిన్ కావాలని కలలు కంటూ ప్రయత్నాలు చేస్తుంటుంది. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో లీలా – అరవింద్ పెళ్లి జరుగుతుంది. పెళ్లి తర్వాత వారి జీవితాలు ఎలా మారాయి ?, అసలు అరవింద్ తన జీవితంలో ఏం కోల్పోయాడు ?, అలాగే లీలను హీరోయిన్ గా చేసేందుకు అరవింద్ ఎలాంటి రిస్క్ చేశాడు ?, చివరకు లీల తన భర్తకు చేరువైందా ? లేదా అనేది మిగిలిన కథ.

ప్లస్ పాయింట్స్: ప్రాణంగా ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య పూర్తిగా దూరంగా పెడితే ఆ భర్త మానసిక పరిస్థితి ఎలా ఉంటుంది ?, తన ప్రేమతో భార్య ప్రేమను దక్కించుకోవడానికి అతను చేసిన ప్రయత్నాలు ఏమిటి.. ఈ మధ్యలో సినిమా మేకింగ్ డ్రామాతో పాటు సిస్టర్ సెంటిమెంట్, భార్యాభర్తల మధ్య ఎమోషన్స్ మరియు కొన్ని కామెడీ సీన్స్ అండ్ డైలాగ్స్.. ఇవన్నీ ఈ లవ్ గురు సినిమాకి బాగా ప్లస్ అయ్యాయి. మొత్తానికి సినిమాలో వినోదంతో పాటు కొన్ని ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో హీరోగా నటించిన విజయ్ ఆంటోనీ తన నటనతో, తన బాడీ లాంగ్వేజ్ తో మరియు ఎమోషనల్ అండ్ యాక్షన్ సీక్వెన్స్ స్ లో చాలా బాగా నటించాడు. అలాగే క్లిష్టమైన కొన్ని కీలక సన్నివేశాల్లో కూడా విజయ్ ఆంటోనీ నటన బాగుంది. సినిమాలో కీలకమైన పాత్రలో నటించిన హీరోయిన్ మృణాళిని రవి కూడా తన పాత్రకి పూర్తి న్యాయం చేసింది. హీరోకి మామగా నటించిన సీనియర్ నటుడు వీటీవీ గణేష్ కూడా చాలా బాగా నటించాడు. వీటీవీ గణేష్ డైలాగ్స్ కొన్ని పేలాయి. యోగి బాబు పంచ్ లు అండ్ కామెడీ టైమింగ్ కూడా బాగుంది. తలైవాసల్ విజయ్, ఇళవరసు, సుధ, శ్రీజ రవిలతో సహా ఇతర పాత్రల్లో కనిపించిన మిగిలిన నటీనటులు కూడా తమ పరిధి మేరకు బాగా నటించారు. ఇక ఈ సినిమాలో అరవింద్ పాత్ర.. ఆ పాత్రకు సంబంధించిన సిస్టర్ ట్రాక్.. హీరోయిన్ పాత్రతో ముడి పడిన సీన్స్.. మొత్తానికి ఈ సినిమాలో కొన్ని కామెడీ అంశాలు మెప్పించాయి.

మైనస్ పాయింట్స్: ఈ లవ్ గురు సినిమా చూసినంత సేపు షారుక్ ఖాన్ 'రబ్ దే బనా దియా జోడి' అనే సినిమా కథ గుర్తుకు వస్తూ ఉంటుంది. కథలో సిస్టర్ సెంటిమెంట్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచినా, కథ కథానాలు మాత్రం రెగ్యులర్ గానే సాగాయి. నిజానికి సినిమా మెయిన్ పాయింట్ లో మ్యాటర్ ఉన్నపటికీ.. ఆ పాయింట్ కి తగ్గట్టు స్క్రీన్ ప్లే రాసుకోవడంలో దర్శకుడు వినాయక్ వైద్యనాథన్ కొన్ని చోట్ల తడబడ్డాడు. అసలు ఇలాంటి కాన్సెప్ట్ తీసుకున్నప్పుడు ఆ కాన్సెప్ట్ కి తగ్గట్టు సినిమాని ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తిస్తూ అలాగే మంచి ఎంటర్ టైనర్ గా ప్లేని నడపాలి. కానీ, కొన్ని చోట్ల అలా సాగలేదు. అలాగే, హీరోహీరోయిన్ల మధ్య ప్రేమకు సంబంధించిన ట్రాక్ కు కూడా సరైన బలం లేదు. భార్య కోసం సినిమా ప్రొడ్యూస్ చేసే క్రమంలో వచ్చే సీన్స్ ఇంకా ఎంటర్ టైన్ గా ఉండి ఉంటే బాగుండేది.

సాంకేతిక విభాగం: టెక్నికల్ గా చూసుకుంటే.. సినిమాలో సాంకేతిక విభాగం వర్క్ బాగానే ఉంది. ముఖ్యంగా భరత్ ధనశేఖర్ సంగీతం సినిమాకు బాగా ప్లస్ అయింది. అదే విధంగా ఫరూక్ జే బాష సినిమాటోగ్రఫీ వర్క్ కూడా సినిమాకు హైలెట్ గా నిలిచింది. ఎడిటర్ గా విజయ్ ఆంటోనీ వర్క్ సినిమాకి తగ్గట్టు ఉంది. ఐతే, సినిమాలో నిర్మాతగా విజయ్ ఆంటోనీ పాటించిన ప్రొడక్షన్ వాల్యూస్ చాలా బాగున్నాయి.

తీర్పు: 'లవ్ గురు అంటూ వచ్చిన ఈ చిత్రంలో మెయిన్ కాన్సెప్ట్, సినిమా మేకింగ్ డ్రామా, మరియు కామెడీ అండ్ లవ్ సీన్స్ అలరించాయి. అలాగే, కొన్ని ఎమోషనల్ ఎలిమెంట్స్ ముఖ్యంగా సిస్టర్ సెంటిమెంట్ బాగుంది. ఐతే, ఇంట్రెస్టింగ్ గా సాగని ట్రీట్మెంట్ తో పాటు 'రబ్ దే బనా దియా జోడి' సినిమా గుర్తుకు రావడం, మెయిన్ క్యారెక్టరైజేషన్స్ బలహీనంగా ఉండటం వంటి అంశాలు సినిమా ఫలితాన్ని దెబ్బ తీశాయి. ఓవరాల్ గా ఈ చిత్రం ఫ్యామిలీ ప్రేక్షకులకు మాత్రం కనెక్ట్ అవుతుంది.



# గీతాంజలి మళ్ళీ వచ్చింది రివ్యూ

అంజలి ప్రధాన పాత్రలో, శ్రీనివాస్ రెడ్డి, సునీల్, సత్యం రాజేష్, సత్య కీలక పాత్రల్లో.. శివ తుర్లపాటి దర్శకత్వం లో తెరకెక్కిన హారర్ కామెడీ ఎంటర్టైనర్ గీతాంజలి మళ్ళీ వచ్చింది. కాగా ఈ చిత్రం ఈ రోజు విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం!

కథ: శ్రీను (శ్రీనివాస రెడ్డి) సినిమా పరిశ్రమలో దర్శకుడిగా ఛాన్స్ కోసం తన టీమ్ తో ప్రయత్నాలు చేస్తుంటాడు. ఈ క్రమంలో తమ ఆర్థిక కష్టాల నుంచి బయట పడేందుకు తన ఫ్రెండ్ సత్య (అయాన్)ని హీరోని చేస్తానని అబద్ధాలు చెబుతూ అతని దగ్గర డబ్బులు తీసుకుంటూ లైఫ్ నెట్టుకొస్తుంటారు శ్రీను అండ్ అతని టీమ్. ఐతే, ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో వారికి సత్య హీరోగా ఓ సినిమా చేసే అవకాశం వస్తోంది. ఊటీలో ఓ కాఫీ రిసార్ట్ నడుపుతున్న అంజలి (అంజలి) శ్రీను సినిమాలో హీరోయిన్ గా నటించడానికి ఒప్పుకుంటుంది. కాకపోతే, నిర్మాత విష్ణు ఊటీలోని దెయ్యాల కోట సంగీత్ మహల్ లోనే షూటింగ్ చేయాలని షరతు పెడతాడు. ఇంతకీ, ఆ సంగీత్ మహల్ గతం ఏమిటి ?, ఆ మహల్ లోని దెయ్యాల కథ ఏమిటి ?, అసలు విష్ణు ఎవరు ?, అతను ఎందుకు శ్రీను బ్యాచ్ ను మరియు అంజలిని టార్గెట్ చేశాడు ?, తన చెల్లి అంజలిని సేవ్ చేయడానికి గీతాంజలి (అంజలి) ఏం చేసింది ? అనేది మిగిలిన కథ.

ప్లస్ పాయింట్స్: మొత్తానికి భయంతో కూడుకున్న కామెడీనే సక్సెస్ ఫార్మాట్ గా తీసుకోని గీతాంజలికి సీక్వెల్ గా ఈ సినిమా వచ్చింది. ఈ జోనర్ లో సినిమా అంటేనే.. కామెడీ, భయం లాంటి అంశాలతో అల్లుకొని రాసుకున్న సీన్స్ తోనే ప్రధానంగా ఈ సినిమా సాగుతుంది. ఈ సినిమా కూడా అలాగే సాగింది. ముఖ్యంగా కోన వెంకట్ టీమ్ ఇటు ఎంటర్టైన్మెంట్ తో పాటు అటు భయాన్ని, ఎమోషన్ని కూడా బాగానే పండించారు. ఇక నటీనటుల పెర్ఫార్మన్స్ విషయానికి వస్తే.. ఎప్పటిలాగే ఈ సినిమాలోనూ కమెడియన్ సత్య కామెడీనే హైలైట్ గా నిలిచింది. హీరోయిన్ అంజలి పర్ఫార్మెన్స్ కూడా చాలా బాగుంది. ముఖ్యంగా అంజలి కొన్ని హర్రర్ సన్నివేశాల్లో తన నటనతో మెప్పించింది. మరో ప్రధాన పాత్రలో నటించిన శ్రీనివాస్ రెడ్డి కూడా బాగానే మెప్పించాడు. ఇక ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించిన సత్యం రాజేష్, షకలక శంకర్, రవి శంకర్, రావు రమేష్ తమ నటనతో ఆకట్టుకున్నారు. అలాగే తల్లి దెయ్యం పాత్రలో నటించిన ప్రియ కూడా బాగా నటించింది.ఇక మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రలకు న్యాయం చేసారు. దర్శకుడిగా శివ తూర్లపాటి హర్రర్ అండ్ కామెడీ కాంబినేషన్ లో వచ్చే కొన్ని సీన్స్ తో ప్రేక్షకులని ఆకట్టుకున్నాడు.

మైనస్ పాయింట్స్: దర్శకుడు శివ తూర్లపాటి తెరకెక్కించిన కొన్ని హర్రర్ అండ్ కామెడీ సన్నివేశాలు ఆకట్టుకున్నప్పటికీ.. కథనంలో కొన్ని సీక్వెన్స్ లో ఫ్లో మిస్ అయింది. ఏ సీన్ కి ఆ సీన్ బాగుందనిపించినా, ఓవరాల్ గా కథలో మిళితమయ్యి ఉండవు. ఇకపోతే కథనం మరియు నేరేషన్ లో ఇంతకు ముందు వచ్చిన గీతాంజలి లో ఫాలో అయిన స్క్రీన్ ప్లే ఫార్మాట్ నే ఈ రెండో పార్ట్ లో కూడా ఫాలో అయ్యారు. దాంతో కొన్ని సీన్స్ ఇంతకు ముందు చూసినవే కదా అన్న ఫీలింగ్ కలుగుతుంది.పైగా సెకండాఫ్ మొదలైన 10 నిమిషాల తర్వాత గాని ఆడియన్ అసలు కథలోకి వెళ్ళడు. అలాగే ఫస్ట్ హాఫ్ లోని కామెడీ కూడా బాగా విసిగించింది. అసలు అనవసరమైన వర్కౌట్ కానీ సీన్స్ ను ఫస్ట్ హాఫ్ లో తీసేసి ఉంటే.. సినిమాకు బాగా ప్లస్ అయ్యేది. ఓవరాల్ గా హర్రర్ సీన్స్, సెకండ్ హాఫ్ లో కామెడీ ఎలిమెంట్స్ బాగున్నా.. మిగతా కంటెంట్ అంతా రెగ్యులర్ గానే సాగింది.


సాంకేతిక విభాగం: సాంకేతిక విభాగం గురించి మాట్లాడుకుంటే.. అందులో మొదటగా చెప్పుకోవాల్సింది రచయిత కోన వెంకట్ పనితనం గురించే.. కొన్ని విసిగించే సీన్స్ ను కూడా ఆయన కామెడీగా చెప్పే ప్రయత్నం చేశారు. ఇక సినిమాటోగ్రఫీ ఈ హర్రర్ కామెడీ సినిమాకి బాగా సెట్ అయ్యింది. ప్రవీణ్ లక్కరాజు అందించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాగుంది. ఎడిటింగ్ ఫస్ట్ హాఫ్ పరంగా కొంచెం స్లోగా సాగిన, సెకెండ్ హాఫ్ ను కట్ చేసిన విధానం బాగుంది. కోన ఫిల్మ్ కార్పోరేషన్, ఎం వివి సినిమాస్ నిర్మాణ విలువలు బాగున్నాయి.

తీర్పు: గీతాంజలి మళ్ళీ వచ్చింది' అంటూ వచ్చిన ఈ హారర్ రివెంజ్ డ్రామా.. కొన్ని కామెడీ సన్నివేశాలతో పాటు కొన్ని హారర్ ఎలిమెంట్స్ తో కొన్ని చోట్ల బాగా ఆకట్టుకుంది. సత్య – సునీల్ తమ కామెడీ టైమింగ్ తో సినిమా స్థాయిని పెంచే ప్రయత్నం చేశారు. కాకపోతే రొటీన్ హర్రర్ ఎలిమెంట్స్ మరియు ఇంట్రెస్ట్ గా సాగని ఫస్ట్ హాఫ్ వంటి అంశాలు సినిమాకి మైనస్ అయ్యాయి. మొత్తమ్మీద ఎక్కువ అంచనాలు లేకుండా వెళ్తే.. ఈ సినిమాలోని కొన్ని కామెడీ ఎలిమెంట్స్ బాగానే ఎంటర్ టైన్ చేస్తాయి.



## కవితకు మరో షాక్
## తీహార్ జైల్లో అరెస్ట్ చేసిన సీబీఐ

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరో షాక్ తగిలింది. మనీ లాండరింగ్ కు సంబంధించి ఈడీ కేసులో ఇప్పటికే ఆమె తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. తాజాగా, కవితను గురువారం ఈ కేసులో సీబీఐ అరెస్ట్ చేసింది. కాగా, లిక్కర్ కేసుకు సంబంధించి కవితను ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు కోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం అందుకు అనుమతి ఇచ్చింది. దీంతో ఈ నెల 6న కేంద్ర దర్యాప్తు సంస్థ ఆమెను ప్రశ్నించింది. ఇదే కేసులో గతంలో ఆమెను సీబీఐ ప్రశ్నించింది. తాజాగా, కవితను కస్టడీలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తో కలిసి ఆమె కుట్రలు పన్నారని సీబీఐ ఆరోపించింది. ఈ క్రమంలో కవితను జ్యుడీషియల్ కస్టడీ నుంచి సీబీఐ హెడ్ క్వార్టర్స్ కు తరలించనున్నారు. మరోవైపు, కవిత రెగ్యులర్ పిటిషన్ పై ఈ నెల 16న విచారణ జరగనుండగా.. తాజాగా సీబీఐ కస్టడీలోకి తీసుకోవడం సంచలనంగా మారింది.



## బీసీలకు 50 ఏళ్లకే
## నెలకు రూ.4 వేల పింఛన్
### టీడీపీ అధినేత చంద్రబాబు

ఆధునిక సమాజంలో 'కుల నిర్మూలన' ఉద్యమాలకు బీజం నాటిన తొలితరం సామాజిక సంస్కర్త జ్యోతిబా ఫులే అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఫులే జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్) వేదికగా ఆయన పోస్ట్ చేశారు. ఆ మహాశయుడి ఆశయాల్లో భాగంగానే టీడీపీ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించిందని చెప్పారు. ఫులే స్ఫూర్తితోనే బీసీలకు మరిన్ని హామీలు ఇచ్చినట్లు చెప్పారు. 'మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు 50 ఏళ్లకే నెలకు రూ.4 వేల పింఛన్ ఇస్తాం. రూ.1.50 లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తాం. స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తాం. వృత్తిదారులకు ఆదరణ పథకం ద్వారా రూ.5 వేల కోట్ల విలువ చేసే పరికరాలను అందిస్తాం.

## సీఎం కేజ్రీవాల్ పర్సనల్ సెక్రటరీపై వేటు

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మనీలాండరింగ్ కేసులో అరెస్టై.. జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రైవేట్ పర్సనల్ సెక్రటరీ భిభవ్ కుమారుపై వేటు పడింది. ఢిల్లీ డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ గురువారం ఆయన్ను విధుల నుంచి తొలగించింది. ఈ మేరకు విజిలెన్స్ స్పెషల్ సెక్రటరీ వైవీవీజే రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. భిభవ్ కుమార్‌పై నమోదైన కేసు, తాత్కాలిక నియామకానికి సంబంధించి సెంట్రల్ సివిల్ సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించి నియమించినందకు ఆయన విధులను రద్దు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.





## హార్దిక్ సోదరులకు రూ.4.3కోట్ల కుచ్చుటోపీ..
## కజిన్ వైభవ్ పాండ్యా అరెస్టు

క్రికెటర్లు హార్దిక్, కృనాల్ పాండ్యా తమ సమీప బంధువు చేతిలోనే మోసపోయారు. వరుసకు సోదరుడయ్యే వైభవ్ పాండ్యా వీరికి పార్ట్‌నర్‌షిప్ బిజినెస్‌లో దాదాపు రూ.4.3కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టాడు. దీనిపై ఫిర్యాదు చేయడంతో ముంబయి పోలీసు ఆర్థిక నేరాల విభాగం అధికారులు వైభవ్‌ను అరెస్టు చేశారు. పాండ్యా సోదరులు, కజిన్ వైభవ్ కలిసి 2021లో సంయుక్తంగా పాలిమర్ వ్యాపారాన్ని ప్రారంభించారు. ఇందులో హార్దిక్, కృనాల్‌కు 40శాతం చొప్పన పెట్టుబడులున్నాయి. మిగతా 20శాతం వాటా ఉన్న వైభవ్ ఈ బిజినెస్ రోజువారీ కార్యకలాపాలను చూసుకున్నాడు. లాభాలను కూడా ఇదే నిష్పత్తిలో పంచుకున్నారు. అయితే, పాండ్యా సోదరులకు తెలియకుండా కొద్ది రోజుల క్రితం వైభవ్ సొంతంగా మరో పాలిమర్ వ్యాపారాన్ని ప్రారంభించాడు. దీంతో గతంలో భాగస్వామ్యంతో పెట్టిన బిజినెస్‌కు లాభాలు తగ్గి రూ.3కోట్ల మేర నష్టం వాటిల్లింది. అదే సమయంలో వైభవ్ రహస్యంగా తన లాభాల వాటాను 20శాతం నుంచి 33 శాతానికి పెంచుకున్నాడు. సంస్థ అకౌంట్ నుంచి భారీ మొత్తంలో డబ్బును తన ఖాతాకు మళ్లించుకున్నాడు. అలా మొత్తంగా దాదాపు రూ.4.3కోట్ల మేర హార్దిక్ సోదరులను మోసగించాడు. ఈ విషయంపై క్రికెటర్లు అడగ్గా.. పరువు తీస్తానంటూ బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది. దీంతో హార్దిక్, కృనాల్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న ముంబయి పోలీసులు బుధవారం వైభవ్‌ను అరెస్టు చేశారు. దీనిపై తదుపరి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## స్కూలు బస్సు బోల్తా... ఎనిమిదిమంది చిన్నారులు దుర్మరణం!

హర్యానాలోని మహేంద్రగఢ్ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిదిమంది చిన్నారులు మృతిచెందారు. ఈ ఘటనలో మరో 20 మంది చిన్నారులు గాయపడ్డారు. ఈరోజు(గురువారం) ఉదయం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. కనీనా పట్టణం సమీపంలోని కనీనా- దాద్రి రోడ్డులో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో గాయపడిన చిన్నారులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. బస్సు అతి వేగంతో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో స్థానికంగా కలకలం చెలరేగింది. పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం ఈ బస్సు కనీనాలోని జిఎల్ పబ్లిక్ స్కూల్‌కు చెందినది. విద్యార్థులతో వెళుతున్న ఈ బస్సు ఉన్హాని గ్రామ సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిదిమంది విద్యార్థులు మృతి చెందగా, 20 మంది గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థులను రోహ్తక్ పీజీఐకి తరలించారు. ఈద్ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీ, పలు ప్రైవేట్ పాఠశాలలను తెరిచారు. ఇదే కోవలో జీఎల్ పబ్లిక్ స్కూల్‌కు కూడా సెలవు ఇవ్వలేదు. డ్రైవర్ మద్యం మత్తులో బస్సు నడుపుతున్నట్లు సమాచారం. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం మహేంద్రగఢ్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా ఇప్పటి వరకు పాఠశాల యాజమాన్యం నుంచి ఈ ఘటనపై ఎలాంటి ప్రకటన రాలేదు.

